సాక్షి
గుంటూరు
గురువారం । 8 । ఆగస్టు । 2024



వెండి కిరీటాలు బహూకరణ

కొల్లూరు: కొల్లూరుకు చెందిన సూరపనేని ప్రసాదరావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు వెండి కిరీటాలను అనంతభోగేశ్వర ఆలయంలోని దేవతామూర్తులకు వితరణ చేశారు.



49,224 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 47,647 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి 49,224 బస్తాలు అమ్మకాలు జరిగాయి.



వైభవంగా పుష్పయాగం

నగరంపాలెం: గుంటూరు బృందావన్‌గార్డెన్స్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం గోదా అమ్మవారి తిరునక్షత్రం సందర్భంగా పుష్పయాగం వైభవంగా నిర్వహించారు.

కోట్లకు మైనింగ్ పడగ

తెలుగు తమ్ముళ్ల మాఫియా

- రాత్రీపగలు తేడా లేకుండా తవ్వకాలు
- లారీ ఒక్కొక్కటి రూ.6 వేల నుంచి రూ.8 వేలకు అమ్మకం
- రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు ఆసరా
- ప్రజాప్రతినిధి అండదండలతో రూ.కోట్ల ప్రభుత్వ ఆదాయానికి గండి
- చోద్యం చూస్తూ కూర్చున్న మైనింగ్, పోలీస్ అధికారులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: అధికారం మాది అడిగేవాడెవడు అన్నచందంగా ఉంది అధికార పార్టీ తెలుగు తమ్ముళ్ల పరిస్థితి. ప్రభుత్వ భూమి, ప్రైవేట్ భూమి ఏదైనా సరే మైనింగ్ చేయాల్సిందే. రూ.కోట్లకు కోట్లు దండుకోవాల్సిందే. ఎవరైనా అడ్డువస్తే అధికారులనైనా బెదిరించడమే.



ఓబుల్‌నాయుడుపాలెంలో గ్రావెల్ తరలిస్తున్న దృశ్యం

ప్రజాప్రతినిధి అల్లుడి పేరుతో..

గుంటూరు నగర పరిసర ప్రాంతాల్లో మట్టి, గ్రావెల్ మైనింగ్ విచ్చలవిడిగా సాగుతోంది. గుంటూరు రూరల్ మండలంలో ఓబులునాయుడుపాలెం, నాయుడుపేట, వెంగళాయపాలెం, చిన్నపలకలూరు, గోరంట్ల తదితర గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధి కనుసన్నల్లో అక్రమ మైనింగ్ సాగుతోంది. ప్రజా ప్రతినిధి అల్లుడు పేరుతో మట్టి తవ్వకాలు చేపడుతున్నట్లు సమాచారం. ఏకంగా ప్రజాప్రతినిధి కార్యాలయం నుంచి ఒకరిద్దరు తవ్వకాలు జరిపే ప్రాంతంలో రాత్రి, పగలు తరలిస్తున్న వాహనాల లెక్కలు రాసుకునేందుకు వస్తున్నారంటే ఏ స్థాయిలో మైనింగ్‌కు పాల్పడుతున్నారో అర్థం చేసుకోవచ్చు. ఎక్కడ పడితే అక్కడ విచ్చలవిడిగా తవ్వకాలు చేస్తూ లారీ ఒక్కొక్కటి రూ.6 వేల నుంచి రూ.8 వేల వరకు విక్రయిస్తున్నారు. స్థానిక తెలుగుదేశం నాయకులతో కలిపి ప్రజా ప్రతినిధులే ఇలా అక్రమ తవ్వకాలు చేస్తుండటంతో సర్వత్ర చర్చనీయాంశంగా మారింది. ఒక్కో ప్రాంతంలో ఒక్కో స్థానిక నాయకుడికి ఈ మైనింగ్ బాధ్యతలు అప్పగించడం విశేషం.



గోరంట్లలో మట్టి తవ్వకాలు

రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కలిసి..

రాజధాని ప్రాంతం తుళ్లూరు మండలంలో వడ్డమాను అక్రమ మైనింగ్‌కు అడ్డాగా మారింది. రియల్ ఎస్టేట్ వెంచర్ల నిర్వాహకులు, తెలుగుదేశం నాయకులు కలిసి అక్రమ మైనింగ్ దందాకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా మట్టి తవ్వకాలు చేసి విక్రయాలకు పాల్పడుతూ కోట్లాది రూపాయల ప్రభుత్వ ధనాన్ని స్వాహా చేస్తున్నారు. తాడికొండ మండలంలోని లచ్చన్నగుడిపూడి గ్రామంలో మైనింగ్ రాత్రి సమయంలో నిర్వహిస్తున్నారు. చేబ్రోలు మండలంలోని శేకూరు, వీరనాయునిపాలెం, వడ్లమాను గ్రామాల్లో యథేచ్ఛగా మైనింగ్ నడుస్తోంది. యడ్లపాడు మండలం, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు మండలాల్లో రాత్రి సమయాల్లో గుట్టు చప్పుడు కాకుండా మైనింగ్ జరుగుతూనే ఉంది. అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నవారిని ఎవరైనా ప్రశ్నిస్తే అధికారం మాది అధికారంలో ఉన్నవారిని కూడా అధికారులు ప్రశ్నిస్తారా అన్న సమాధానాలు ఎదురవుతున్నాయనే చర్చ సాగుతోంది. తెలుగు తమ్ముళ్ళ బెదిరింపులకు భయపడి అధికారులు అక్రమాల వైపు చూసేందుకూ సాహసించడం లేదు.



చినపలకలూరులో తవ్వకాలు



చేనేత దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్, చిత్రంలో కలెక్టర్ నాగలక్ష్మి

చేనేతకు పూర్వ వైభవం

మంగళగిరి: చేనేత పరిశ్రమకు పూర్వవైభవం తీసుకొస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. గురువారం పట్టణంలో నిర్వహించిన జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధతో కలిసి తొలుత ఎస్‌ఆర్‌ఐ జంక్షన్‌లోని నేతన్న విగ్రహానికి నేత మాలధారణ చేశారు. అనంతరం తెనాలి రోడ్డులోని మార్కేండేయ కల్యాణమండపంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. చేనేత వారోత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. చేనేత కార్మికులకు పరికరాలు అందిస్తామని, ముద్ర రుణాలు, రాయితీలు, ఆరోగ్య బీమాతో భద్రత కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు చిల్లపల్లి శ్రీనివాసరావు,జగ్గారపు శ్రీనివాసరావు, కాండ్రు శ్రీనివాసరావు, గుత్తికొండ ధనుంజయరావు, దామర్ల రాజు, కలెక్టర్ నాగలక్ష్మి , చేనేత జౌళి శాఖ ఏడీఏ వనజ, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ,, తెనాలి సబ్ కలెక్టర్ ప్రకాష్ జైన్, ఎంటీఎంసీ కమిషనర్ ఆలీంభాషా తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల ర్యాలీ

ఎస్‌ఆర్‌ఐ జంక్షన్‌లోని నేతన్న విగ్రహానికి చేనేత కార్మికులు నేతమాల ధారణ చేసిన పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రతినిధులు పిల్లలమర్రి నాగేశ్వరావు, పిల్లలమర్రి బాలకృష్ణ, బత్తూరి మోహనరావు, గజిపల్లి వెంకటకృష్ణ, బత్తుల హరి, దొడ్డి ఈశ్వరరావు, నందం బ్రహ్మేశ్వరరావు, రామనాథం పూర్ణచంద్రరావు, కూరపాటి వెంకటేశ్వరరావు, కౌతారపు వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

చేనేతల జీవన ప్రమాణాలు మెరుగుకు కృషి

గుంటూరు వెస్ట్: చేనేత కళాకారుల జీవన ప్రమాణాల మెరుగుకు కృషి చేస్తామని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో 10వ జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మంగళగిరితోపాటు పొన్నూరు, తెనాలి, ఫిరంగిపురంలో చేనేత క్లస్టర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. చేనేత వస్త్రాల ముడి సరుకు రుణాలు అందిస్తామన్నారు. టెక్స్టైల్ ఇంజినీరింగ్ కోర్సు 100 సీట్లతో నల్లపాడులోని ఎంబీటీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో అందుబాటులో ఉంచామన్నారు. అనుబంధ డిజైనింగ్, డైయింగ్, వీవింగ్, ప్రింటింగ్, తదితర కోర్సులను వీవర్స్ సర్వీస్ సెంటర్ ద్వారా అందిస్తున్నామని పేర్కొన్నాను. చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలకు బ్రాండ్ బిల్డింగ్ హ్యాండ్లూమ్ మార్క్‌ను అందిస్తున్నామని కలెక్టర్ వివరించారు. జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు వనజ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలకు వ్యక్తిగతంగానూ, సొసైటీలుగా దరఖాస్తు చేసుకుంటే వాటిని కలెక్టర్ ఆమోదంతో నిధులు మంజూరు చేస్తామన్నారు. జిల్లాలో కోటి 70 లక్షలు ముద్రా రుణాలు చేనేత కార్మికులకు అందజేసామని చెప్పారు.

న్యూస్‌రీల్

గోదాదేవి తిరునక్షత్ర మహోత్సవం



తాడేపల్లిరూరల్: సీతానగరంలోని విజయకీలాద్రి దివ్య క్షేత్రంపై బుధవారం గోదాదేవి తిరునక్షత్ర మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ పరమహంస పరివ్రాజకులు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి మంగళ శాసనాలతో ఉదయం 9 గంటలకు గోదాదేవి అమ్మవారికి తిరుమంజనం (అభిషేకం), తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించామని, మహిళా భక్తులు అధికసంఖ్యలో పాల్గొని గోదాదేవిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారని తెలిపారు. కార్యక్రమంలో విజయకీలాద్రి దేవస్థాన అర్చకులు, జీయర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ వేదపండితులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.


రేపు హెచ్‌సీఎల్ టెక్‌బీ ప్రోగ్రాం ఎంపికలు

గుంటూరుఎడ్యుకేషన్:గుంటూరు జిల్లా ఉపాధి కార్యాలయం, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 9న హెచ్‌సీఎల్ టెక్‌బీ ప్రోగ్రాం ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.రఘు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఐటీ రంగంలో కెరీర్‌ను ప్రారంభించేందుకు ఆసక్తి కలిగి 2023, 2024 సంవత్సరాల్లో ఇంటర్ నాన్ మాథ్స్ (సీఈసీ, హెచ్‌ఈసీ, బైపీసీ, ఒకేషనల్) కోర్సులను 75 శాతం మార్కులతో పూర్తి చేసిన యువతీ, యువకులు అర్హులని తెలిపారు. సంబంధిత అభ్యర్థులు బయోడేటా, రెజ్యూమ్, విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్, ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో జిల్లా కలెక్టరేట్ ఎదుట ఉన్న ప్రభుత్వ ఐటీఐలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్న హెచ్‌సీఎల్ ఎర్లీ ట్రెనింగ్ ప్రోగ్రామ్ ఇంటర్వ్యూలకు నేరుగా హాజరు కావాలని సూచించారు. రాత పరీక్ష, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారని, ఇతర వివరాలకు 80746 07278 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

13న భవిష్యనిధి పెన్షన్ అదాలత్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు కృష్ణనగర్‌లోని భవిష్యనిధి ప్రాంతీయ కార్యాలయంలో ఈనెల 13న పెన్షన్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ ఇంద్రనీల్ ఘోష్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలోని పీఎఫ్ పెన్షనర్లు వారి ఫిర్యాదులు, దరఖాస్తులను నేరుగా భవిష్యనిధి కార్యాలయంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్న పెన్షన్ అదాలత్‌లో సమర్పించవచ్చని తెలిపారు. వ్యక్తిగతంగా హాజరు కాలేని వారు ఆన్‌లైన్, వాట్సాప్, వెబ్ మార్గాల ద్వారా పంపవచ్చని సూచించారు. ro.guntur@epfindia.gov.inతో పాటు వాట్సాప్ నంబరు 94946 57469కు పంపాలని తెలిపారు. ల్యాండ్‌లైన్ నంబర్లు 0863-2344106, 2232921 నంబర్లో సంప్రదించాలని పేర్కొన్నారు. అదే విధంగా వెబ్ ఎక్స్ ఐడీ 2644 636 3676, పాస్‌కోడ్ epfo@1234 ద్వారా లాగిన్ కావాలని తెలిపారు. పీఎఫ్ పెన్షన్ దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భవిష్యనిధి పింఛనుదారులు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలని పీఎఫ్ కమిషనర్ తెలిపారు. పింఛను పొందుతున్న వారు బ్యాంకు, సీఎస్‌సీ, పీఎఫ్ కార్యాలయం ద్వారా పోస్ట్ ఇన్ఫో యాప్ ద్వారా లైఫ్‌సర్టిఫికెట్లు సమర్పించాలని, లేకుంటే పోస్ట్‌మెన్ నేరుగా ఇంటికే వచ్చి వేలిముద్ర, ఐరిష్, స్కాన్ ద్వారా లైఫ్ సర్టిఫికెట్ స్వీకరిస్తారని తెలిపారు. ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారా ఆధార్ ఫేస్ యాప్, జీవన ప్రమాణ ఫేస్ అప్లికేషన్ ఉపయోగించి ఆధార్ నంబరుతోనూ లైఫ్ సర్టిఫికెట్ సమర్పించవచ్చునని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు పీఎఫ్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 6,034 క్యూసెక్కులు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 296, బ్యాంక్ కెనాల్‌కు 1578, తూర్పు కెనాల్‌కు 640, పశ్చిమ కెనాల్‌కు 270, నిజాంపట్నం కాలువకు 380, కొమ్మమూరు కాలువకు 2880 క్యూసెక్కులు విడుదల చేశారు.

పోటెత్తుతున్న వరద

ఎగువ నుంచి వరద నీరు వస్తుండడంతో కృష్ణమ్మ జలకళను సంతరించుకుంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు సాధారణ స్థాయికి చేరుకోవడంతో 18 క్రస్ట్‌గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. దీంతో దిగువ ప్రాంతాలకు వరద నీరు పోటెత్తుతుంది. ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. మేళ్లవాగు, కొండవీటి వాగు, మద్దూరు, నక్కల వాగు పొంగిపొర్లుతున్నాయి. ఆయా మార్గాలలో రాకపోకలు స్తంభించాయి. కృష్ణా పరివాహక ప్రాంతంలోని గ్రామాల్లోకి వరదనీరు వచ్చి చేరుతుండడంతో అప్రమత్తమైన అధికారులు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



అమరావతిలోని అమరేశ్వర ఘాట్ వద్ద జలకళ సంతరించుకున్న కృష్ణానది

- సాగర్ నుంచి భారీగా వరద నీరు విడుదల
- జిల్లాలో పొంగుతున్న వాగులు
- స్తంభించిన రాకపోకలు – అప్రమత్తమైన అధికారులు
- సురక్షిత ప్రాంతాలకు ముంపు గ్రామాల ప్రజలు

అమరావతి: పులిచింతల ప్రాజెక్టు నుంచి బుధవారం సుమారు రెండు లక్షల క్యూసెక్కులు విడుదల చేయటంతో అమరావతి వద్ద కృష్ణానది జలకళ సంతరించుకుంది. వరదనీరు భారీగా వస్తుండటంతో అమరావతి మండలంలోని సుమారు 30 కిలోమీటర్ల మేర నదీ పరివాహక గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. కృష్ణమ్మను తిలకించేందుకు అమరావతిలోని అమరేశ్వర, ధ్యానబుద్ధ ఘాట్‌ల వద్దకు ప్రజలు తరలివస్తున్నారు. ఘాట్‌లలో ప్రమాదాలు జరగకుండా పూర్తిస్థాయిలో భద్రతా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. కృష్ణానది కూడా ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ప్రవాహం ఎదురు తన్ని మేళ్లవాగు, కొండవీటి వాగు, మద్దూరు వాగులలో భారీగా వరదనీరు ప్రవహిస్తోంది. అమరావతి-క్రోసూరు రహదారిలో ఊటుకూరు వద్ద నక్కలవాగు పొంగి ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి.



పులిచింతల పరివాహక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ రమణకాంత్‌రెడ్డి

ముంపు గ్రామాల్లో ఆర్డీఓ పర్యటన

మాచవరం: పులిచింతల ముంపు గ్రామాలు భీమవరం, రేగులగడ్డల్లో గురజాల ఆర్డీఓ రమణకాంత్‌రెడ్డి బుధవారం పర్యటించారు. ఎగువ నుంచి వరద నీరు పులిచింతల ప్రాజెక్టుకు చేరడంతో ఆయా గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి నష్టం జరగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు.

కప్పల వాగు వద్ద రక్షణ

ఊటుకూరు(క్రోసూరు): మండలంలోని ఊటుకూరు వద్ద కప్పల వాగు పొంగి ప్రవహిస్తోంది. అచ్చంపేట, క్రోసూరు నుంచి అమరావతి మీదగా గుంటూరు వెళ్లే ఆర్టీసీ బస్సులు రాకపోకలు నిలిచిపోయాయి. అమరావతి పరిధి గ్రామాలు, క్రోసూరు శివారు గ్రామమైన బయ్యవరం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎస్‌ఐ ఎం.షఫీ పొంగి ప్రవహిస్తున్న కప్పలవాగును సందర్శించారు. పరిస్థితి సమీక్షించి కాపలా ఏర్పాటుచేశారు. కప్పలవాగు నుంచి వెళ్లకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. అమరావతి బెల్లంకొండ డబుల్‌రోడ్డు నిర్మాణంలో భాగంగా ఊటుకూరు వద్ద కప్పలవాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. తాత్కాలికంగా పక్కనే ఉన్న తాత్కాలిక అప్రోచ్ రోడ్డు మీద నుండి రాకపోకలు సాగిస్తున్నారు. వాగు పొంగి రాకపోకలు నిలిచిపోయాయి.



పొంగిప్రవహిస్తున్న కప్పలవాగు

విద్యకు ఉపకారం

- ప్రతిభావంతుల అన్వేషణ
- ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులకు కేంద్రం ఉపకార వేతనాలు
- ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు విడుదలైన నోటిఫికేషన్
- డిసెంబర్ 8న రాష్ట్ర వ్యాప్తంగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు సెప్టెంబర్ 6 వరకు గడువు
- పరీక్షలో ప్రతిభ చూపితే 9వ తరగతి నుంచి సీనియర్ ఇంటర్ వరకు ఏడాదికి రూ.12వేలు చొప్పున ఉపకార వేతనం మంజూరు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఏటా ఎంపికవుతున్న 450 మందికిపైగా విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రతిభే కొలమానంగా ఉపకార వేతనాలు దక్కనున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేసి, వారికి 9వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ పూర్తి చేసేందుకు ఆర్థిక చేయూత అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిభ ఆధారంగా ఉపకార వేతనాలు మంజూరు చేస్తోంది. ఇందు కోసం ఏటా జాతీయ ప్రతిభా ఉపకార వేతన (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష నిర్వహిస్తోంది. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, ఏపీ మోడల్ స్కూల్స్‌లో చదువుతున్న విద్యార్థులే పరీక్ష రాసేందుకు అర్హులు. ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్‌కు పరీక్షలో ప్రతిభ చూపడం ద్వారా వరుసగా 9,10,11,12వ తరగతుల్లో ఏడాదికి రూ.12వేలు చొప్పున ఉపకార వేతనం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుంది.



గుంటూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు (ఫైల్)

పరీక్ష విధానం

- నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష జాతీయస్థాయిలో జరుగుతుంది. ఇందులో అర్హత సాధించిన విద్యార్థులకు ఉపకార వేతనం మంజూరవుతుంది.
- మెంటల్ ఎబిలిటీ (మాట్), ఆప్టిట్యూడ్ (శాట్) అంశాల్లో ఒక్కో పేపర్‌కు 90 మార్కుల చొప్పున పరీక్ష నిర్వహిస్తారు. 6,7,8 తరగతుల నుంచి ప్రశ్నలు వస్తాయి. 90 నిమిషాల్లో పరీక్ష జవాబులు రాయాల్సి ఉంటుంది.
- విద్యార్థులు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుల ద్వారా సెప్టెంబర్ ఆరో తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, పరీక్ష రుసుంను సెప్టెంబర్ 10లోపు ఆన్‌లైన్‌లో పొందుపర్చిన ఎస్‌బీఐ లింగ్ ద్వారా చెల్లించాల్సి ఉంది. డిసెంబర్ 8వ తేదీన రెవిన్యూ డివిజన్ కేంద్రాల్లో పరీక్ష జరగనుంది.
- ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లాలో యేటా 450 మంది విద్యార్థులు ఎంపికవుతున్నారు. వీరిలో గుంటూరు-145, పల్నాడు-181, బాపట్ల జిల్లాలో 124 మంది చొప్పున ఉంటున్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు అర్హతలు

- ఎన్‌ఎంఎంఎస్ రాసేందుకు విద్యార్థినీ, విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ యాజమాన్యంలోని పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ ఉండాలి. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.3.50 లక్షలకు మించరాదు.
- విద్యార్థులు సెప్టెంబర్ 6వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. పరీక్ష ఫీజు కింద ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీలు రూ.50 చొప్పున చెల్లించాలి. ఇందుకు సంబంధించిన యూజర్ మాన్యువల్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్‌ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్‌లో ఉంది.

విద్యార్థులతో దరఖాస్తు చేయించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులతో ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తు చేయించాలి. నాలుగేళ్లపాటు అందించే ఉపకార వేతనాన్ని పొందేలా విద్యార్థులను ప్రోత్సహించడంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలి. ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులతో దరఖాస్తు చేయించాలని ప్రభుత్వ పరీక్షల విభాగ ఉన్నతాధికారుల సూచనల మేరకు తగు చర్యలు తీసుకోవాలి.

– పి.శైలజ, జిల్లా విద్యాశాఖాధికారి, గుంటూరు

జీజీహెచ్‌లో నోటిఫికేషన్ల రగడ




గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో ప్రస్తుతం నోటిఫికేషన్ల రగడ జరుగుతోంది. దీనిపై కలెక్టర్‌కు, సీఎం, ఆరోగ్యశాఖ మంత్రికి ఫిర్యాదులు వెళ్లాయి. ఉద్యోగోన్నతిపై జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి 2016లో నోటిఫికేషన్ వెలువడింది. అప్పట్లో అర్హులుగా ముగ్గురి పేర్లు ప్రకటించి రెండు ఖాళీలు మాత్రమే ఉండటంతో ఇద్దరితో భర్తీచేశారు. మూడో అభ్యర్థికి ఖాళీ ఏర్పడగానే పోస్టు ఇస్తామని చెప్పారు. అయితే తనకు అన్యాయం చేశారని మూడో అభ్యర్థి కోర్టుకు వెళ్లారు. అయినా జీజీహెచ్ కార్యాలయ ఉద్యోగులు పట్టించుకోలేదు. ప్రస్తుతం పోస్టులు ఖాళీగా లేవని, పోస్టు ఖాళీ ఏర్పడినప్పుడు మూడో అభ్యర్థికి ఉద్యోగోన్నతి కల్పిస్తామని అప్పట్లో లిఖితపూర్వకంగా కోర్టుకు నివేదించారు. తాజాగా గత నెల 30న మళ్లీ జూనియర్ అసిస్టెంట్ పోస్టును భర్తీ చేస్తున్నట్లు నోటిఫికేషన్ విడుదల చేయడంతో దీనిపై ఆస్పత్రిలో రగడ జరుగుతోంది. నోటిఫికేషన్‌లో ఇంటర్ విద్యార్హత ఉంటే సరిపోయే దానికి డిగ్రీ విద్యార్హత పెట్టారని, తప్పులు ఉన్నాయని కలెక్టర్‌కు పలువురు అభ్యర్థులు ఫిర్యాదు చేశారు. ఈ నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ నేతలు మంగళవారం ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు.

రికార్డు అసిస్టెంట్ పోస్టుపైనా మీనమేషాలు

రికార్డు అసిస్టెంట్ పోస్టు ఖాళీ ఏర్పడి ఐదేళ్లు గడిచినా ఆస్పత్రి అధికారులు భర్తీ చేయకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో నోటిఫికేషన్ ఇచ్చినా ఇప్పటికీ భర్తీ చేయలేదు. దీంతో జీజీహెచ్ అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఉద్యోగులు సీఎం నారా చంద్రబాబునాయుడికి, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ఈనెల 3న లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

బంగారు తాపడం పనులకు రూ. 3.01 లక్షల విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ ఆలయ బంగారు తాపడం పనులకు విజయవాడకు చెందిన భక్తులు విరాళాన్ని అందజేశారు. విజయవాడ లంబాడీపేట గాంధీబొమ్మ సెంటర్‌కు చెందిన బండి లక్ష్మణరావు కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఈ సందర్భంగా ఆలయ అధికారులను కలిసి బంగారు తాపడం పనులకు రూ.3,01,116ను విరాళంగా అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు.

క్లుప్తంగా

కాకుమాను ఆరోగ్య కేంద్రంలో టైల్స్ ధ్వంసం



కాకుమాను: మండల కేంద్రం కాకుమాను గ్రామ సచివాలయం–2 పరిధిలో గత ప్రభుత్వంలో నిర్మించిన హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ ఆవరణలో ఏర్పాటు చేసిన టైల్స్‌ను బుధవారం వేకువజామున గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ రవి ప్రసాద్, వెల్‌నెస్ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. రోజు మాదిరిగానే మంగళవారం తమ విధులు ముగించుకుని సిబ్బంది వెళ్లారు. బుధవారం ఉదయం 9 గంటలకు విధులకు హాజరయ్యే సమయానికి వెల్‌నెస్ సెంటర్ ఆవరణలో ఏర్పాటు చేసిన టైల్స్ ధ్వంసమై కనిపించాయి. నీటి పైపులు, నీటి కుంటను పూడ్చివేసినట్లు వారు తెలిపారు. జేసీబీతో ధ్వంసం చేసినట్లు ఆనవాళ్లు ఉన్నట్లు గుర్తించారు. విషయాన్ని జిల్లా వైద్యాధికారుల దృష్టికి తీసుకువెళ్లి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు డాక్టర్ రవి ప్రసాద్ తెలిపారు.

పరిశోధనల దిశగా ప్రోత్సహించాలి

నరసరావుపేట ఈస్ట్: పాఠశాల విద్య స్థాయి నుంచే విద్యార్థులను పరిశోధనల వైపు ప్రోత్సహించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం ఇన్‌స్పైర్ మానిక్ నామినేషన్లపై జిల్లాలోని సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఈఓ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాలలోని పాఠశాలల నుంచి సైన్స్ ప్రాజెక్టులు నామినేట్ చేసేలా కృషి చేయాలని సైన్స్ ఉపాధ్యాయులను కోరారు. ఉన్నత పాఠశాలల నుంచి ఐదుగురు విద్యార్థులు, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి ముగ్గురు విద్యార్థులు ప్రాజెక్టులను తయారు చేసేలా ప్రోత్సహించాలని తెలిపారు. 13 సంవత్సరాలుగా జిల్లా సైన్స్ ఆఫీసర్‌గా సేవలు అందించిన ఏ.ఏ.మధుకుమార్‌ను ఘనంగా సత్కరించారు. మధుకుమార్ హయాంలో జిల్లాలోని విద్యార్థులకు ఎన్నోమార్లు అవార్డులు లభించాయని తెలిపారు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.5000, గరిష్ట ధర రూ.6300, మోడల్ ధర రూ.5800 వరకు పలికింది.

ముగిసిన లీజ్.. ఉత్తుత్తిగానే సీజ్!

- పీవీకే నాయుడు మార్కెట్ కాంప్లెక్స్‌లో ఇదీ తీరు
- మూసేసిన షాపు ముందు యథేచ్ఛగా వ్యాపారం
- అంతా తెలిసీ చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు



కాంప్లెక్స్‌లో సీజ్ చేశాక కూడా నిర్వహిస్తున్న షాపు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ షాపుల నిర్వహణలో రెవెన్యూ అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారనే చెప్పాలి. షాపు లీజు గడువు పూర్తయి తాళాలు వేసినప్పటికీ వాటిని యథేచ్ఛగా నిర్వాహకులు తిరిగి నిర్వహించుకోవడం చూస్తుంటే అధికారులు ఎంత మొద్దు నిద్రలో ఉన్నారో స్పష్టంగా తేటతెల్లమవుతోంది. తెల్లవారుజామునే దుకాణం షట్టరు ఎత్తి సామగ్రి బయట పెట్టుకోవడం.. షట్టరు వేసి పగలంతా బయట కార్యకలాపాలు నిర్వహించుకోవడం.. చీకటి పడ్డాక వెళ్లేముందు లోపల సామగ్రి పెట్టడం సర్వసాధారణంగా మారింది.

కొల్లి శారద మార్కెట్‌లోనూ ఇంతే...

కొల్లి శారద మార్కెట్‌లో 25 ఏళ్ల లీజు గడువు పూర్తవ్వడంతో షాపుల స్వాధీనానికి రెవెన్యూ అధికారులు మూడు నెలల క్రితం నోటీసులు ఇవ్వాల్సి ఉంది. లీజు గడువు వారం రోజుల్లో పూర్తవుతుందనగా తాపీగా నోటీసులు ఇచ్చారు. దీనిపై లీజుదారులు హైకోర్టును ఆశ్రయించారు. మూడు నెలల ముందు ఇవ్వాల్సిన నోటీసులు వారం ముందు ఇస్తే ఎలా ఖాళీ చేస్తారంటూ హైకోర్టు కూడా నగరపాలక సంస్థ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. నోటీసులు రద్దు చేస్తూ కేసు కొట్టివేసింది. ఇది జరిగి నెలలు గడుస్తున్నా వారికి ఖాళీ చేయాలని నోటీసులు మాత్రం ఇవ్వడం లేదు. కావాలనే అధికారులు ఇలా తాత్సారం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

– సి.హెచ్.శ్రీనివాస్, డెప్యూటీ కమిషనర్ –2

పీవీకే నాయుడు మార్కెట్ కాంప్లెక్సులో లీజు గడువు పూర్తయిన షాపును సీజ్ చేసినప్పటికీ నిర్వాహకులు అనధికారికంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

ఆరోపణలు వచ్చినా..

పీవీకే నాయుడు మార్కెట్ కాంప్లెక్స్‌లో ఓ షాపును 25 ఏళ్లకు లీజుకిచ్చారు. ఆ గడువు ముగిసిపోవడంతో 2022లో రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. అయినప్పటికీ దుకాణ నిర్వహణ కొనసాగుతుండటంపై పలు ఆరోపణలు వస్తున్నాయి. తెల్లవారుజామున షట్టర్ ఓపెన్ చేసుకుని సామాను బయట పెట్టుకోవడం... రాత్రి 10.30 గంటల తరువాత షట్టర్ ఓపెన్ చేసి సామగ్రి లోపల పెట్టుకోవడం గమనార్హం. లీజు గడువు పూర్తయిన ప్రతి షాపునకు రెవెన్యూ అధికారులు విద్యుత్ శాఖ సిబ్బంది సహకారంతో కరెంట్ కనెక్షను తొలగించాల్సి ఉంటుంది. కానీ రెవెన్యూ అధికారులు ఇక్కడ ఆ పని మాత్రం చేయలేదు. దీంతో నిర్వాహకులు కరెంట్ యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. అధికారులు, నిర్వాహకులు ఇలా నగరపాలక సంస్థ ఆదాయానికి గండికొడుతున్నారనే విమర్శలు ప్రజల నుంచి వెల్లువెత్తుతున్నాయి. సంబంధిత రెవెన్యూ అధికారికి ప్రతి నెల కొంత మొత్తం నగదు రూపంలో నిర్వాహకులు చెల్లిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



రాత్రి వేళ కరెంట్ వినియోగిస్తున్న దృశ్యం

ప్రతి ఖైదీకి ఉచిత న్యాయ సహాయం

- సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి
- జిల్లా కారాగారంలో తనిఖీలు

నగరంపాలెం: గుంటూరు బ్రాడిపేటలోని జిల్లా కారాగారంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి టి.లీలావతి బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా కారాగారంలోని లీగల్ సర్వీసెస్ క్లినిక్‌ను సందర్శించారు. ఉచిత న్యాయ సహాయం, సూచనల గురించి ఖైదీలకు వివరించారు. ప్రతి ఖైదీకి ఉచిత న్యాయ సహాయం త్వరితగతిన అందించేందుకు ఉన్న అవకాశాలను చెప్పారు. భోజనం, ఇతరత్రా సదుపాయాలపై ఆరా తీశారు. వాటిపై సంతృప్తి వ్యక్తం చేశారు. న్యాయ సహాయం కోసం అర్జీలు అందించాలని, తద్వారా ఉచితంగా వాదించేందుకు న్యాయవాదిని నియమించనున్నట్లు తెలిపారు. స్తోమత లేని ప్రతి రిమాండ్ ఖైదీకి ఉచిత న్యాయ సహాయం అందిస్తామని పేర్కొన్నారు. నేరం జరిగే నాటికి 18 ఏళ్లు నిండకపోతే వారు బాలలే అని అన్నారు. ఏదైనా నేరం చేస్తే బాలల న్యాయ మండలి వద్ద హాజరుపర్చాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ సిస్టం మధుబాబు, జిల్లా జైలు సూపరింటెండెంట్ కె.రఘు, సిబ్బంది పాల్గొన్నారు.



భోజనం రుచి చూస్తున్న సివిల్ జడ్జి లీలావతి

పదోన్నతులు కల్పించాకే సర్దుబాటు చేయాలి

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం హైస్కూలు ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్‌లుగా సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించిన తర్వాతే సర్దుబాటు ప్రక్రియను చేపట్టాలని ఎస్టీయూ ఏపీ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్ఎం సుభాని డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవో నంబర్ 117ను రద్దు చేయకుండా, పదోన్నతులు ఇవ్వకుండా సర్దుబాటు ప్రక్రియ చేపట్టిన పక్షంలో ఉపాధ్యాయుడు ఏ తరగతి బోధించాలో, ఎక్కడ పనిచేయాలో తెలియని గందరగోళ పరిస్థితులు తలెత్తుతాయన్నారు. దీని వల్ల విద్యా ప్రమాణాలు దెబ్బతిని, నాణ్యతా లోపం ఏర్పడుతుందన్నారు. ఉపాధ్యాయ సంఘాలతో చర్చించిన తరువాతే ముందుకు వెళ్లాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉపాధ్యాయవర్గం ఉద్యమాలు చేపట్టవలసి ఉంటుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

బడికి గైర్హాజరైతే కిట్లు వెనక్కే

విద్యార్థుల తల్లిదండ్రులతో సమగ్ర శిక్ష ఏపీసీ విజయలక్ష్మి

ప్రత్తిపాడు: పాఠశాలకు వరుసగా మూడు రోజులు విద్యార్థులు గైర్హాజరైతే వారికి ప్రభుత్వం ఇచ్చిన స్టూడెంట్ కిట్ వెనక్కి తీసుకుంటామని సమగ్ర శిక్ష ఏపీసీ జి. విజయలక్ష్మి అన్నారు. ప్రత్తిపాడు మండలం వంగిపురం జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలల్లో స్థానిక విద్యాశాఖ అధికారులతో కలిసి బుధవారం ఏపీసీ తనిఖీలు నిర్వహించారు. జెడ్పీ హైస్కూలులో విద్యార్థుల సంఖ్యతోపాటు మధ్యాహ్న భోజనం తింటున్న వారు, డ్రాపౌట్స్ వివరాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం తిని, నాణ్యతను పరీక్షించారు. పాఠశాల పరిధిలో 21 మంది విద్యార్థులను డ్రాపౌట్స్ జాబితాలో చూపిస్తున్నారని, వారిని కలిసి ఎందుకు రావడం లేదో విచారణ చేయాలని హెచ్ఎం నాగేశ్వరరావును ఆదేశించారు. అనంతరం పాఠశాలకు హాజరు కాని విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేశారు. గైర్హాజరుకు కారణాలను తెలుసుకున్నారు. ప్రాథమిక పాఠశాలను పరిశీలించి విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య తదితర వివరాలను హెచ్ఎం మరియరాజును అడిగారు. మొత్తం పన్నెండు మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులం ఉన్నామని, ఇద్దరు విద్యార్థులు సెలవు పెట్టారని హెచ్ఎం వివరించారు. గైర్హాజరైన తల్లిదండ్రులకు ఫోన్ చేసి ఎందుకు రాలేదో ఏపీసీ తెలుసుకున్నారు. పాఠశాల పనిరోజుల్లో పిల్లలను తీసుకుని ఊళ్లకు వెళ్లడం సరికాదని, వరుసగా మూడు రోజులు విద్యార్థులు పాఠశాలకు రాకపోతే పేర్లు తీసివేయడంతోపాటు ఇచ్చిన స్టూడెంట్ కిట్‌ను వెనక్కు తీసుకుంటామని తల్లిదండ్రులకు చెప్పారు. అదేవిధంగా మైగ్రేట్ పిల్లలు ఎక్కడకు వెళ్లినా ఫాలోఅప్ చేసి వారు అక్కడ పాఠశాలల్లో చేరేలా హెచ్ఎంలు చర్యలు తీసుకోవాలన్నారు.



గైర్హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడుతున్న విజయలక్ష్మి

లెక్కలు లేకుంటే ఎలా..?

ప్రత్తిపాడు భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తనిఖీలు చేసిన ఏపీసీ అక్కడి ఎస్టీ కాలనీలో ఉన్న బడి ఈడు చిన్నారుల పూర్తి వివరాలను ఎంఈవో–2 జి. లీలారాణి, సీఆర్పీలను అడిగారు. సరైన సమాధానం రాకపోవడంతో లెక్కలు లేకుంటే ఎలాగని ప్రశ్నించారు. పూర్తి వివరాలు సేకరించాలని ఆదేశించారు. ఆమె వెంట ఎంఈవో రమాదేవి, హెచ్ఎం హెచ్. శ్రీనివాసరావు తదితరులున్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు నిలిపివేతకు వినతి

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాలల్లో ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియను అనుమానాలు నివృత్తి చేసే వరకు నిలిపేయాలని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు కె.బసవ లింగారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా విద్యాశాఖాధికారిణి పి.శైలజకు ఆమె కార్యాలయంలో ఇతర నేతలతో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకే కేడర్‌లో మిగులు ఉపాధ్యాయుల సీనియారిటీని మెరిట్ కం రోస్టర్ జాబితా లేకుండా నిర్ధారించడం కుదరదన్నారు. ఈ విషయం బడుల్లో ఘర్షణకు దారితీస్తోందన్నారు. ఎస్జీటీలకు మండల, హైస్కూల్ వారికి డివిజన్ స్థాయిలో మాన్యువల్‌గా ప్రక్రియ చేపట్టాలన్నారు. రాష్ట్ర స్థాయిలో ఆన్‌లైన్ విధానం సరికాదన్నారు. గ్రీవెన్స్ సెల్స్ ఏర్పాటుకు విన్నవించారు. డీఈవోను కలిసిన వారిలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్, జిల్లా ఉపాధ్యక్షుడు పి.నాగ శివన్నారాయణ, జిల్లా కార్యదర్శులు సత్యన్నారాయణ మూర్తి, జి.దాస్, జిల్లా కౌన్సిలర్లు కిషోర్, శివరామకృష్ణ, జోసెఫ్ కిరణ్, గురుమూర్తి, గౌస్ తదితరులు పాల్గొన్నారు.



డీఈవో శైలజకు వినతిపత్రం సమర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

దాడి కేసులో మహిళకు ఏడాది జైలు శిక్ష

నరసరావుపేట టౌన్: దాడి కేసులో మహిళకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.సత్యశ్రీ బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. చిలకలూరిపేట మండలం పురుషోత్తపట్నంకు చెందిన తోట అనంతలక్ష్మిపై బాకీ విషయంలో 2018 మే 12వ తేదీన అదే ప్రాంతానికి చెందిన కొండ సత్యవతి దాడికి పాల్పడింది. ఈ మేరకు బాధితురాలిచ్చిన ఫిర్యాదుతో చిలకలూరిపేట పోలీసులు కేసు నమోదు చేసి ప్రాథమిక దర్యాప్తు అనంతరం కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. నేరం రుజువు కావటంతో నిందితురాలికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ చిలకలూరిపేట కోర్టు 2021 డిసెంబర్ 12న తీర్పు చెప్పింది. శిక్షపై నిందితురాలు జిల్లా కోర్టుకు అప్పీలు చేసుకోవటంతో దిగువ కోర్టు విధించిన శిక్షను యథావిధిగా అమలు చేస్తూ తీర్పు చెప్పారు.

సీట్లు పెంచాకే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలుకు డిమాండ్

గుంటూరు రూరల్: ఎంబీబీఎస్ సీట్లు విక్రయించడానికి అనుకూలంగా జీవో నెంబర్ 107, 108లను తీసుకొచ్చారని ఏపీ మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఆ జీవోలను రద్దు చేయటంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు కళాశాలల్లో సీట్లు పెంచకుండా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలు చేస్తే బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీ జనరల్ విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఉన్న సీట్లను పెంచిన తరువాత మాత్రమే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం చేసిన చట్టంలోనే ఉందని గుర్తు చేశారు. ఇప్పుడు ఓపెన్ సీట్లలో 10 శాతం కోత విధించి ఈడబ్ల్యూఎస్ అమలు చేయాలని ప్రభుత్వం ఎలా భావిస్తుందని ప్రశ్నించారు. ఈడబ్ల్యూఎస్‌కు తాము వ్యతిరేకం కాదని, ప్రైవేటు కళాశాలల్లో సీట్లు పెంచిన తరువాత మాత్రమే ఈ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 107, 108లను రద్దు చేయాలని, నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లోని మొత్తం సీట్లను ప్రతిభావంతులైన విద్యార్థులకే కేటాయించాలని కోరారు.

క్వారీ గుంతలో వ్యక్తి గల్లంతు

- ఎన్డీఆర్ఎఫ్ బృందంతో గాలింపు
- ఆందోళనలో కుటుంబ సభ్యులు
- 24 గంటలు గడిచినా లభించని ఆచూకీ



గాలింపు చేస్తున్న ఎస్డీఆర్ఎఫ్ బృందం

పిడుగురాళ్ల: పుల్కా తినేందుకు దాబాలో కూర్చున్న సమయంలో ఒక్కసారిగా పోలీసులు సైరన్ వస్తుండటంతో భయపడి పరుగు తీసే క్రమంలో పంజాబీ దాబా వెనుక ఉన్న క్వారీ గుంతలో పడి వ్యక్తి గల్లంతైన సంఘటన పిడుగురాళ్ల పట్టణంలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. సమాచారం మేరకు... పిడుగురాళ్ల పట్టణానికి చెందిన నాయిని హనుమంతరావు (36)తోపాటు మరో ఇరువురు జెమిని, వెంకటేశ్వర్లు పంజాబీ దాబాలో పుల్కా తినేందుకు వెళ్లారు. అప్పటికే సమయం అర్ధరాత్రి 12 గంటలు అవుతుంది. పిడుగురాళ్ల పట్టణ సీఐ రాత్రి సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పంజాబీ దాబాలో లైట్లు వెలుగుతుండటంతో సైరన్ వేసుకుంటూ పోలీసులు అక్కడకు వెళ్లారు. పోలీసులు కొడతారేమోనని భయంతో ముగ్గురు పరుగులు తీశారు. నాయిని హనుమంతరావు డాబా వెనుక వైపు పరుగులు తీశాడు. ఆ ప్రాంతమంతా చీకటిగా ఉండటంతో క్వారీ గుంత కనిపించక అందులో పడిపోయాడు. గమనించిన పంజాబీ దాబాలో పనిచేసే వర్కర్ హిందీలో దాబా నిర్వాహకుడికి చెప్పాడు. అతను పట్టణ సీఐ వెంకట్రావుకు సమాచారం ఇచ్చాడు. వెంటనే గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతు అయిన హనుమంతరావుకు చెందిన చెప్పులు కనిపించడంతో దాని ఆధారంగా గల్లంతైనట్లు గుర్తించారు. గజ ఈతగాళ్లకు హనుమంతరావు కనిపించలేదు. బుధవారం సాయంత్రం ఎస్డీఆర్ఎఫ్ (స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) ద్వారా గాలింపు చర్యలు చేపట్టారు. 24 గంటల తరువాత పూర్తి సమాచారం వస్తుందని పట్టణ సీఐ తెలిపారు. బుధవారం రాత్రి 10 గంటలకు గల్లంతైన హనుమంతరావు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు రోదనలో మిగిలిపోయారు.

బకింగ్‌హామ్ కెనాల్‌లో మహిళ గల్లంతు



తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి వైఎస్సార్ సెంటర్ (కొత్తూరు) ఆంజనేయస్వామి దేవస్థానం ప్రాంతానికి చెందిన ఓ మహిళ బకింగ్‌హామ్ కెనాల్‌లో బుధవారం గల్లంతయ్యారు. సేకరించిన వివరాల ప్రకారం.. వైఎస్సార్ సెంటర్ (కొత్తూరు)లో నివాసం ఉంటున్న దాసరి పాండురంగారావు భార్య శివనాగమణి (58) ఇంట్లో పూజా సామగ్రి, ఇతర వస్తువులను కాలువలో కలిపేందుకు బయలుదేరారు. ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద మెట్ల మార్గంలో కిందికి దిగి బకింగ్‌హామ్ కెనాల్ నీటిలో కలుపుతుండగా నీటి వేగానికి కింద పడిపోవడంతో ఆమె గల్లంతయ్యారు. వెంటనే స్థానికులు ఆమె కోసం గాలించినప్పటికీ ప్రయోజనం కనిపించలేదు. భర్త పాండురంగారావు దీనిపై తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జెడ్పీ జాగా.. వేసెయ్ పాగా!

- జిల్లా పరిషత్ స్థలంపై టీడీపీ నేతల కన్ను
- రూ. కోట్ల విలువైన రెండు ఎకరాలు దక్కించుకునేందుకు యత్నాలు
- సత్తెనపల్లి ప్రధాన రహదారి పక్కన కబ్జా తంతు
- ఆక్రమణలు జరుగుతున్నా పట్టించుకోని అధికార యంత్రాంగం



సత్తెనపల్లి వడ్డవల్లి పరిధిలోని జెడ్పీస్థలం



జెడ్పీ స్థలంలో ఏర్పాటు చేసిన దుకాణం

సత్తెనపల్లి: సామాన్య ప్రజలు గూడు కోసం చిన్న పాక వేసుకుంటే అధికారులు నానా హంగామా చేసి, అది ఊడ పెరికేదాక ఊరుకోరు. అయితే ఏకంగా రూ. కోట్లు విలువచేసే జడ్పీ భూమి తమ కళ్లెదుటే దర్జాగా ఆక్రమించుకుంటున్నా తమకేమీ పట్టనట్లు కళ్లకు గంతలు కట్టుకొని కూర్చున్నారు. ఇదీ పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని ప్రధాన రహదారి పక్కన గల రెండు ఎకరాల జడ్పీ స్థలం ఆక్రమణ తంతు. సత్తెనపల్లి పట్టణంలోని గుంటూరు – మాచర్ల ప్రధాన రహదారి పక్కన వడ్డవల్లి రఘురాంనగర్ పరిధిలోని సర్వే నెంబర్ 12లో 3 ఎకరాల భూమిని కట్టమూరి అహోబిల భాస్కరరావు విద్యాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని విద్యాసంస్థలు నెలకొల్పి అభివృద్ధి చేసేందుకు జడ్పీకి దానం ఇచ్చారు. ఆ భూమి అవసరం లేని పక్షంలో తమ కుటుంబ సభ్యులకు ఇవ్వమని అప్పట్లో బైలాలో రాసుకున్నారు. అయితే ఆ భూమిలో ఎకరం భూమిని అయ్యప్ప స్వామి దేవాలయానికి కేటాయించడంతో ఆలయం నిర్మాణం పూర్తయి ప్రస్తుతం పూజలు జరుగుతూ వాడుకలో ఉంది.

కోర్టులో భూ వ్యవహారం..

ఎంతో దయార్ద్ర హృదయంతో విలువైన భూమిని దానం ఇచ్చినప్పటికీ మిగిలిన రెండు ఎకరాల భూమిని ఖాళీగా ఉంచారు. ఎలాంటి విద్యాసంస్థలు నెలకొల్పకపోవడంతో తన తండ్రి ఆశయం నెరవేరలేదు కనుక తిరిగి భూమిని తమకు అప్పగించాలని అహోబిల భాస్కరరావు కుమారుడు కట్టమూరి నరసింహారావు జడ్పీని కోరాడు. దీనిపై అధికారులు ఏమీ తేల్చకపోవడంతో కట్టమూరి నరసింహారావు వేరొకరికి రెండు ఎకరాలు విక్రయించాడు. దీనిపై అటు జడ్పీ అధికారులు, ఇటు కట్టమూరి నరసింహారావులు కోర్టును ఆశ్రయించగా జడ్పీకి అనుకూలంగా తీర్పు వచ్చింది. అయితే కట్టమూరి నరసింహారావు నుంచి కొనుగోలు చేసిన వ్యక్తులు మరొకరికి భూమిని విక్రయించాడు. వారు కూడా కోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారం కోర్టులో నడుస్తోంది.

అన్యాక్రాంతం కాకుండా గత ఎమ్మెల్యేల కృషి..

సత్తెనపల్లిలోని విలువైన రెండు ఎకరాల జిల్లా పరిషత్ స్థలం అన్యాక్రాంతం కాకుండా గత ముగ్గురు ఎమ్మెల్యేలు కృషి చేశారు. 2004, 2009లో సత్తెనపల్లి శాసనసభ్యుడుగా ఎన్నికైన యర్రం వెంకటేశ్వరరెడ్డి ఆ స్థలాన్ని సంరక్షించారు. అనంతరం 2014 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎన్నికైన డాక్టర్ కోడెల శివప్రసాదరావు విలువైన జిల్లా పరిషత్తు స్థలం వృథాగా ఉంటే అన్యాక్రాంతమవుతుందనే ఉద్దేశంతో కొంత స్థలంలో పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. ఇక 2019 సార్వత్రిక ఎన్నికల్లో శాసనసభ్యుడిగా ఎన్నికైన అంబటి రాంబాబు విలువైన రెండు ఎకరాల జిల్లా పరిషత్ స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా రూ. 20 లక్షలు వినియోగించి స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణం, రెండు వైపులా గేట్లు ఏర్పాటు చేయించారు.

ఆక్రమణల యత్నాల్లో టీడీపీ నేతలు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో విలువైన రెండు ఎకరాల జడ్పీ స్థలంపై టీడీపీ నేతల కన్ను పడింది. లీజు అగ్రిమెంట్ రాయించుకొని కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టేందుకు వేగంగా పావులు కదుపుతున్నారు. ఇప్పటికే జడ్పీస్థలానికి ముందు భాగంలో రోడ్డు పక్కన చిరువ్యారులు చిన్న చిన్న బంకులు ఏర్పాటు చేసుకున్నారు. జడ్పీ స్థలంలో నిర్మించిన గెస్ట్‌హౌస్ పక్కన ఖాళీ స్థలం ఆక్రమించి వెంకటేశ్వర జనరల్ స్టోర్ పేరుతో ఇనుముతో తయారు చేయించిన బంకు ఏర్పాటు చేశారు. ఇలా ఆక్రమణల పర్వం మొదలైంది. టీడీపీకి చెందిన ఓ ముఖ్య నాయకుడు పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్‌కి పక్కన ఖాళీగా ఉన్న స్థలాన్ని ఎలాగైనా దక్కించుకోవాలని ప్రయత్నాలు ముమ్మరం చేశాడని ఆ పార్టీ వర్గాలే బహిరంగంగా చర్చించుకుంటున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ ఆస్తుల సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.